# తిరుగుబాటు

★

ట్యాంక్‌బండ్ మీద కూర్చుని హుస్సేన్‌సాగర్ నీళ్లల్లో ప్రతిబింబించే ఎలక్ట్రిక్ దీపాల వెలుగును చూడటం నాకెంతో ఇష్టం –

అర్ధరాత్రి దాటి ఉంటుంది.

రోడ్డుమీద వాహనాల రద్దీ చాలావరకు తగ్గిపోయింది. జన సంచారం కూడా చాలా పలచబడింది.

సిమెంట్ బెంచీమీద కూర్చుని, హుస్సేన్‌సాగర్ నీళ్లలోకి, దూరంగా వెలుగుతున్న కరెంట్ దీపాల వరసల కేసి తదేకంగా చూస్తున్న నాకు, అకస్మాత్తుగా సిగరెట్ తాగాలన్న కోరిక కల్గింది.

జేబులో సిగరెట్స్ లేవు – అసలు నా జేబులో సిగరెట్స్ ఎప్పుడూ ఉండవు. నేను రెగ్యులర్ స్మోకర్ని కాదు. నాకు సిగరెట్స్ తాగాలని యే క్షణంలో అనిపిస్తే ఆ క్షణంలో సిగరెట్ కొనుక్కొని తాగుతాను. నేను యే పని చేసినా ఇలాగే చేస్తుంటాను. ప్రతి పనిని మొదలే ఆలోచించి, చాలా ప్లాన్డ్‌గా, సిస్టమాటిగ్గా చెయ్యటమంటే నాకు పరమ అసహ్యం. ఐ లైక్ స్పాంటెనిటీ!

రోడ్డు పక్కన దూరంగా సిగరెట్స్ అమ్మే షాపు తెరిచే ఉంది. అటువైపు నడువ సాగాను.

నేను కూర్చున్న బెంచీకి కొంచెం దూరంలోనే మరో బెంచీమీద ఎవరో నాలాగే యేకాంతంగా కూర్చుని హుస్సేన్‌సాగర్ నీళ్లల్లోకి అదేపనిగా చూస్తున్నారు. అతడు నాలాంటివాడే అయ్యుంటాడనుకున్నాను.

అతడు నన్ను చూడగానే ఎంతో పరిచయమున్నవాడిలా ''హాయ్'' అన్నాడు ఉత్సాహంగా.

నా చెవుల్ని నేను నమ్మలేకపోయాను.

అతడు అతడు కాడు! ఆమె!!

''కమాన్... రండి... లెటజ్ ఎంజాయ్ హుస్సేన్‌సాగర్ టుగెదర్...'' ఎంతో ఉత్సాహంగా ఆహ్వానించిందామె. ఆమెకు వెంటనే యేమని సమాధానం చెప్పాలో నాకు తోచలేదు.

''నాకో సిగరెట్ కావాలి. సిగరెట్ కోసం వెడ్తున్నాను'' అన్నాను.

''నా దగ్గరున్నాయి రండి''

ఆమె తొడుక్కున్న బెల్‌బాటమ్స్ హిప్ పాకెట్లోంచి 'రెడ్‌విల్స్' పాకెట్ తీసి నా కందించింది.

వెళ్లి ఆమె పక్కన కూర్చున్నాను.

నేనో సిగరెట్ తీసుకుని నోట్లో పెట్టుకున్నాను. ఆమె కూడా ఓ సిగరెట్ తీసుకుంది. పాకెట్లోంచి లైటర్ తీసి ఆమె సిగరెట్, నా సిగరెట్ వెలిగించింది.

'మా అన్నయ్య సిగరెట్స్ తెగ తగలేస్తాడు. అతని జేబులోంచి ఈ సిగరెట్ ప్యాకెట్ దొంగిలించుకొచ్చాను. ఈ మగవాళ్లు చూడండి. తాము సిగరెట్స్ తాగొచ్చు... విస్కీ తాగొచ్చు... అడ్డమైనదాని పక్కలో పడుకోవచ్చు... అర్ధరాత్రి దాటేదాకా ఊరంతా తిరగొచ్చు... అదే ఆడదనేటప్పటికి అన్నీ అడ్డంకులే.... అన్నీ నీతులే! పురుషుడికో నీతిని, స్త్రీకో నీతిని పాటించే ఈ మగవాళ్లంటే, ఈ మగవాళ్లనే సమర్థించే ఈ సమాజమంటే నాకు పరమ అసహ్యం.... రియల్ బాస్టర్డ్స్'' అందామె తన ముక్కుల్లోంచి పొగ వదులుతూ.

నాకిప్పటికి ఆమె స్త్రీ అంటే నమ్మకం కుదరడం లేదు. జీన్స్, బెల్‌బాటమ్స్ అరచేతి వెడల్పు బెల్టుతో టక్ చేసింది. మగవాడిలాగే వెంట్రుకలు. కళ్లకు గోగోగాగుల్స్ మగవాడిలాగే ఫ్లాట్‌గా ఉన్న వక్షస్థలం – ఒక్క శ్రావ్యమైన ఆమె కంఠాన్ని బట్టి తప్ప ఆమెను స్త్రీ అని పోల్చుకోవడం ఎవడికీ సాధ్యం కాదు.

గుక్కనిండా సిగరెట్ పొగపీలుస్తూ, ఆమెను గూర్చి ఆలోచిస్తూ హుస్సేన్ సాగర్‌లోకి చూస్తున్నాను.

''నిన్ను చూడగానే నాకెందుకు పలకరించాలనిపించిందో తెలుసా?'' అందామె ఉన్నట్టుండి.

నువ్వే చెప్పమన్నట్టుగా ఆమెకేసి చూశాను.

''నిన్ను చూడగానే... బైదిబై నిన్ను ఏకవచనంలో పిలుస్తున్నందుకు యేమీ అనుకోవుగా... నాకు 'మీరు' 'మీరు' అంటూ దొంగ మర్యాదల్ని పాటించటం చేతకాదు. నిన్ను చూడగానే నిన్ను లైక్ చేశాను – ఎందుకో తెలుసా? నీ గడ్డం...''

అందామె చంటిపిల్లలా కిలాకిలా నవ్వుతూ.

''ఈజిట్?'' అన్నాను నేను కూడా నవ్వుతూ.

''దినేష్ ఠాకూర్ తెలుసా?''

''రజనీగంధ దినేష్ ఠాకూరేనా?''

''ఎగ్జాట్లీ! నీ గడ్డం, నీ నడక, నీ మ్యానరిజమ్స్ అన్నీ అతనిలాగే ఉన్నాయి... యూ లుక్ లైక్ మినీ ఫిలాసఫర్''

నేను నవ్వి ఊరుకున్నాను.

సిగరెట్ పూర్తిచేసి ''థ్యాంక్యూ వెరీమచ్'' అంటూ లేచాను.

''అరె! అప్పుడే వెళ్లిపోతారా?'' అందామె భయంగా, ఆశ్చర్యంగా.

''నా టైమయిపోయింది. పదకొండు తర్వాత ఓ గంటసేపు ఇక్కడ కూర్చుని, మా రూమ్‌కెళ్లి పడుకొని నిద్రపోతాను''

''మీ రూమెక్కడ?''

''ఇక్కడే... దోమలగూడా''

''ఇఫ్ యూ డోన్ట్‌మైండ్.... నేనీ రాత్రి మీ రూమ్‌లో పడుకోవచ్చా?''

కొన్ని క్షణాలవరకూ ఆ అమ్మాయికేసి తీక్షణంగా చూశాను.

''నన్ను మీ రూమ్‌కు తీసికెళ్లటానికి భయపడ్తున్నారు కదూ?'' అందామె చాలా ప్రొవోకింగ్‌గా.

''ఎందుకు భయపడాలి?''

''ఈ అమ్మాయి నన్నెక్కడ చెడగొడ్తుందోనని... ఎక్కడ సెడ్యూస్ చేస్తుందోనని''

''నేనింకా చెడిపోలేదనే అనుకుంటున్నావా?''

''యూలుక్ సో ఇన్నోసెంట్'' నేను నవ్వాను. ఆమె కూడా నవ్వింది.

''కమాన్... వెడదాం పద'' అన్నాను ఆమెకు నా చెయ్యి అందిస్తూ. నా చెయ్యి పట్టుకుని ఆమె లేచింది. ఇద్దరమూ ప్రశాంతంగా ఉన్న ట్యాంక్‌బండ్ మీద నడుస్తున్నాము.

''దగ్గర్లో యేదన్నా బార్‌లాంటిదుందా?''

''ఈ హైదరాబాద్‌లో బార్లు ఎక్కడంటే అక్కడే ఉన్నాయి. కానీ నా దగ్గర మాత్రం డబ్బు లేదు'' అన్నాను.

''నా దగ్గరుంది వెడదామా?''

''నీకు బాగా తాగే అలవాటుందా?''

''ఎప్పుడైనా ఇలాంటి అందమైన రాత్రి, ఇలా స్వేచ్ఛ లభించిన రాత్రి, నీలాంటి అందమైన కుర్రాడు ప్రక్కనున్నప్పుడు నాకు తాగాలనిపిస్తుంది''

నన్నా అమ్మాయి అందమైన కుర్రాడనడం నన్ను నిజంగా షాక్ చేసింది. నాలో ఆమెకు యేం అందం కనిపించిందో ఊహించలేక పోయాను. ఐ యేట్ కన్వెన్షనల్ బ్యూటీ... నీట్‌గా, ట్రిమ్‌గా, ఇస్త్రీ మడతలు నలక్కుండా 'స్నోలు' పౌడర్లు పూసుకొని, నున్నగా తయారై తిరగమంటే నాకు అసహ్యం. నేను చాలా నిర్లక్ష్యంగా డ్రెస్ చేసుకుంటాను. ఆల్‌మోస్ట్ ర్యాగ్స్‌లా వేళ్లాడే డ్రెస్ వేసుకోవడం, యే మోడల్‌కి, యే ఫాషన్‌కి ఫిట్‌గాని డ్రెస్ వేసుకోటం నాకిష్టం. తలకు నూనె రాసుకొని, నున్నగా దువ్వుకోవడం, రోజూ నున్నగా షేవ్

చేసుకోటం... నాకు పట్టదు. నేనసలు తలకు నూనె రాసుకుని ఎంత కాలమైందో! అడ్డదిడ్డంగా పెరిగి, వెంట్రుకలన్నీ భుజాలదాకా వేలాడుతున్నాయి. గుబురుగా పెరిగిన నా గడ్డాన్నీ, చెంపలదాకా పెరిగిన నా సైడ్ బర్న్స్‌ని చూస్తే చంటిపిల్లలు ఝడుసుకుంటాడు... ఇలా ఉండే నన్ను ఈమె అందమైన కుర్రాడనటం... నవ్వాలో, యేడవాలో అర్థం కాలేదు.

ఎందుకో నాకు వెంటనే మరో సిగరెట్ వెలిగించాలనిపించింది.

'వన్‌మోర్ సిగరెట్ ప్లీజ్' అన్నాను.

''హాయ్... హాయ్... వెరీసారీ... ఇందాక మీతో మాట్లాడుతూ సిగరెట్ పాకెట్‌ని హుస్సేన్‌సాగర్‌లోకి విసిరేశాను... నేను కొన్నిసార్లు నాకు తెలియకుండానే ఇలాంటి విచిత్రమైన పనుల్ని చేస్తుంటాను లెండి... ఓసారి యేం చేశానో తెలుసా? మా డాడీ ఆ మధ్య ఢిల్లీ వెళ్లినప్పుడు ఓ అందమైన మార్బుల్ స్టోన్‌తో మలచబడిన ఓ నగ్న నర్తకి బొమ్మ తెచ్చాడు. అది మా డాడీ స్టడీ రూమ్‌లో ఉండేది. ఎందుకో నాకా బొమ్మను చూసినప్పుడల్లా ఓ విచిత్రమైన కోరిక కల్గుతుండేది. నేలకేసి కొట్టి ముక్కలు ముక్కలు చెయ్యాలని. ఓసారి ఇంట్లో ఎవరూ లేనప్పుడు సరిగ్గా ఆ పనే చేశాను. ఆ బొమ్మ విరిగి ముక్కలు ముక్కలై నేలమీద పడిపోతే నాకేదో పిచ్చి ఆనందంతో గంతులు వెయ్యాలనిపించింది''.

నేను నవ్వి ఊరుకున్నాను.

''తర్వాతేమయిందని అడగరేం. అదిగో మళ్లా నిన్ను బహువచనంలో పిలుస్తున్నాను. వెధవ బూర్జువా మర్యాదల్ని ఎంత వదలించుకుందామని ప్రయత్నం చేసినా వదలవే! తర్వాతే మయిందంటే మా మమ్మీ నన్ను బాగా తన్నింది. ఎదురుతిరిగి మళ్లీ తన్నాలన్నంత కసి పుట్టింది'' అందామె పళ్లు కొరుకుతూ.

రోడ్డుపక్కనున్న సిగరెట్ షాపు దగ్గరకెళ్లాను.

''వాట్స్ యువర్ బ్రాండ్?'' అందామె.

''ఎనీ బ్రాండ్ విల్ డూ'' అన్నాను.

''రెడ్‌విల్స్ తీసుకోనా? మా అన్నయ్యకు రెడ్‌విల్స్ అంటే చాలా యిష్టం...'' అంటూ విల్స్ పాకెట్ తీసుకొని నాకో సిగరెట్ అందించి తనొకటి తీసుకుంది. ఆమె తన దగ్గరున్న లైటర్‌తో నా సిగరెట్ వెలిగించబోయింది. నేను ఆ షాపు పక్కనే ఉన్న కిరోసిన్ దీపంతో నా సిగరెట్ వెలిగించుకున్నాను. ఆమె లైటర్‌తో తన సిగరెట్ వెలిగించుకుంది.

''ఈ లైటర్ కూడా మీ అన్నయ్యదేనా?''

''ఔను. నాకు మా అన్నయ్య చేసే పనులన్ని చెయ్యాలని ఉంటుంది.... కానీ మావాళ్లు అన్నయ్యేం చేసినా సంతోషిస్తారు. వాడినో హీరోలా చూస్తారు. అదే నేనేం చేసినా తిడతారు. మా మమ్మీ మరీ. ఐ హేట్ మై మమ్మీ....'' అందామె గట్టిగా సిగరెట్ పీలుస్తూ.

''ఐ హేట్ మై డాడీ'' అన్నాను నేను.

''ఈజిట్? దెన్ లెటజ్ ప్యాస్ ఎ రెజల్యూషన్... ఈ మమ్మీలు డాడీలు లేని ప్రపంచం మాకు కావాలని'' ఇద్దరమూ నవ్వుకున్నాము.

క్రమక్రమంగా ఆ అమ్మాయి దగ్గరౌతోందని గమనించాను. షీ ఈజ్ ఎ ఫైన్ కంపెనీ.

కొంత దూరం నడిచి ఇద్దరమూ ఓ బార్లో దూరాము.

బార్లలో ఉండే వాతావరణం నాకు చాలా ఇష్టం. పూర్తిగా చీకటిగాని పూర్తిగా వెలుగుగాని ఆ వెలుగు నీడల సమ్మేళనం నాకెంతో బావుంటుంది. మన చెవుల్ని ఎంతో మృదువుగా స్పృశించే పాశ్చాత్య సంగీతం జంటలు జంటలుగా కూర్చొని అండర్ టోన్స్‌లో మాట్లాడుకునే జనం... మత్తయిన పానీయాన్ని తాగుతూ మరో ప్రపంచపు అంచుల్లోకి వెళ్లిపోయే అద్భుతమైన అనుభవం - బార్లలో ఎన్ని గంటలైనా గడపవచ్చు.

ఖాళీగా ఉన్న ఓ టేబుల్ దగ్గర కెళ్లి సోఫాల్లో కూర్చున్నాము.

వెంటనే వెయిటర్ వచ్చి నా ముందు నిల్చున్నాడు. ఆ వెయిటర్ నాకు తెలుసు - వాడిపేరు జాన్. నేనీ బార్‌కు ఎప్పుడొచ్చినా నాకు ఈ జానే సర్వ్ చేస్తాడు. జాన్‌కు మా రూమ్‌కూడా తెలుసు. ఎప్పుడైనా మా రూమ్‌లో మా ఫ్రెండ్స్‌తో పార్టీ చేసుకుంటే మాక్కావాల్సిన డ్రింక్స్ జాన్ తెచ్చేవాడు.

''యేం తీసుకుంటావు?'' అమ్మాయి నడిగాను.

''ఎనీథింగ్'' అందామె నిర్లక్ష్యంగా.

''త్రీ ఎక్స్ ఓ హాఫ్ బాటిల్ అండ్ బ్రింగ్ సమ్ చిప్స్'' అన్నాను.

వెయిటర్ వెళ్లిపోయాడు.

''ఇంకేమైనా తింటారా?'' అందామె.

''అదిగో మళ్లీ బహువచనం''

''సారీ... తింటావా?''

''లెటజ్ ఆర్డర్ తందూరి చికెన్''

''ఆల్‌రైట్''

వెయిటర్ వచ్చాక తందూరికి ఆర్డరిచ్చాం.

త్రీఎక్స్ బాటిల్, సోడాలు ఐస్‌ముక్కలు వచ్చాయి.

టూ డ్రింక్స్ తయారుచేసి ఒకటి ఆమెకిచ్చాను.

గ్లాసెస్‌ని టాస్ చేస్తూ ''ఫర్ ది హెల్త్ ఆఫ్'' అని ఇద్దరమూ ఆగిపోయాము.

''నీ పేరే తెలీదు... పోనీలే... నిన్ను 'దినేష్' అని పిలుస్తాను.... రైట్?''

''రైట్'' నిన్ను 'షీలా' అని పిలుస్తాను... రైట్?''

''రైట్'' అందామె ఉత్సాహంగా.

''నో ఫర్ ది హెల్త్ ఆఫ్ షీలా'' అని నేను, ''ఫర్ ది హెల్త్ ఆఫ్ దినేష్'' అని ఆమె అంటూ గ్లాసెస్ టాస్ చేసి తాగటం మొదలుపెట్టాము.

''నీకో మమ్మీ ఉందా దినేష్?''

''ఉంది''

నువ్విలా అర్ధరాత్రి ఓ అమ్మాయి ప్రక్కన కూర్చుని రమ్ తాగుతున్నావని తెలిస్తే మీ మమ్మీ నిన్నేమైనా అంటుందా?''

''మా మమ్మీ చాలా అమాయకురాలు... యేమీ అనదు''

''ఈ జిట్?'' అందామె కళ్లు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూస్తూ.

''నా విషయం పోనీయ్. నువ్విలా ఓ స్ట్రేంజర్ ప్రక్కన కూర్చొని అర్ధరాత్రి ఓ బార్లో రమ్ తాగుతున్నావని తెలిస్తే మీ మమ్మీ ఊరుకుంటుందా?''

''ఊరుకుంటుందా అని మెల్లగా అడుగుతున్నావా? చంపేస్తుంది - షీ ఈజ్ ఎ మాన్స్టర్'' అందామె చేతుల్లో ఉన్నా గ్లాసును కసిగా నేలకేసి కొడుతూ.

పెద్ద చప్పుడుతో గ్లాసు కిందపడి ముక్కలు ముక్కలై పోయింది. బార్లో కూర్చున్న వాళ్లంతా మాకేసి చూశారు.

''హాయ్! లుకెటిట్! వ్వాట్ ఏ బ్యూటిఫుల్ సైట్''

పగిలిపోయిన గాజు ముక్కల్ని పరవశంతో చూసిందామె. వెయిటర్ వచ్చి ఆ గాజుముక్కల్ని యేరుకొని పోయాడు.

''నాకు గ్లాసులంటే చాలా ఇష్టం... ఎందుకో తెలుసా?''

''చాలా సులభంగా పగులగొట్టి సంతోషించవచ్చునని''

''ఎగ్జాక్ట్లీ... 'గ్లాస్ మేనేజరి' అనే టెన్నిసీ విలియమ్స్ డ్రామా చదివావా?''

''టెన్నిసి విలియమ్స్ అంటే నాకు చాలా ఇష్టం''

''రియల్లీ... నాక్కూడా... ఆ డ్రామాలో హీరోయిన్ అంటుంది... 'గ్లాస్ ఈజ్ నో బ్యూటిఫుల్... అండ్ హీ ఈజ్లీ ఇట్ కెన్ బి బ్రోకెన్'... ఆ వాక్యమంటే నాకు చచ్చేంత ఇష్టం...''

''నాక్కూడా'' అన్నాను.

''అరె... మనిద్దరం ఎంత అద్భుతంగా కలిసిపోయాము''

తాగటం పూర్తిచేసి తండూరి అండ్ పరాటాలు తింటున్నాము.

''ఈ పాటికి మా ఇంట్లో పెద్ద గందరగోళం పుట్టి ఉంటుంది... మా మమ్మీ, మా డాడీ, మా అన్నయ్య నా కోసం ఊరంతా వెతుకుతుంటారు... మా మమ్మీ మా డాడీ రాగానే

'అర్ధరాత్రయినా అమ్మాయింకా ఇంటికి రాలేదండి... కాస్త వెళ్లి వెతకండి...' అంటుంది. వెంటనే ఆమెకు కళ్లనీళ్లు కూడా వచ్చేస్తాయి. అదంతా నా మీద ప్రేమనుకునేవు, తన కూతురు ఎవడితోనన్నా లేచిపోయిందేమోనన్న అప్రతిష్ట తన కెక్కడ వస్తుందోనన్న భయం... మా మమ్మీని యేడిపించడానికి నాకు సరిగ్గా ఆ పనే చెయ్యాలనిపిస్తుంది''

వెయిటర్ జాన్ బిల్లు తెచ్చాడు. ఆమె పాకెట్లోంచి వంద రూపాయల నోటు తీసి వెయిటర్ కిచ్చింది.

''మా మమ్మీ యేం చేస్తుందో తెలుసా? మా నాన్నకు తెలియకుండా ఇలాంటి వంద రూపాయల నోట్లెన్నో కొట్టేస్తుంటుంది. నేనేమో మా మమ్మీ దగ్గర్నుంచి కొట్టేస్తుంటాను'' అందామె పెద్దగా నవ్వుతూ, చప్పట్లు కొడుతూ.

ఆమెలో మెల్లగా రమ్ తాగిన ప్రభావం కనిపించసాగింది. వెయిటర్ చిల్లర తెచ్చాడు.

''వెయిటర్! యూ కీప్ దట్ ఛేంజ్... రేపు మీ డాటర్ని ఓ మంచి పిక్చర్‌కి తీసుకెళ్లు'' అంటూ షీలా విసురుగా లేచింది. వెంటనే టేబుల్ మీదున్న గ్లాసులు, ప్లేట్లు పెద్ద శబ్దం చేస్తూ కిందపడి ముక్కలు ముక్కలైపోయాయి.

''ఫెంటాస్టిక్... మార్వెలస్... ఎక్సైటింగ్...''

– అంటూ చప్పట్లు కొడుతూ అరవసాగింది. నేను మెల్లిగా వెయిటర్ దగ్గరున్న ఛేంజ్ (ఒక రూపాయి మాత్రం ఉంచి) తీసుకొని, ఆమెను బయటకు నడిపించుకొని తీసుకొచ్చాను.

'రియల్లీ దినేశ్! తాగటంలో ఎంత ఆనందం ఉందో ఇప్పుడు తెలుస్తుంది. ఇంతకాలం నేనెంత పోగొట్టుకున్నానో.... నాకిప్పుడు హెవెన్లో ఉన్నట్టుగా ఉంది'' అందామె.

బయటకొచ్చి ఇద్దరమూ చెరో సిగరెట్ వెలిగించాము.

''కమాన్ దినేష్... వేరీజ్ యువర్ రూమ్ అయామ్ ఫీలింగ్ స్లీపీ.... టుడే ఐ విల్ స్లీప్ విత్ యూ'' అందామె, నా మీదకు ఒరిగిపోతూ.

కాని నాకింత వరకు ఆ అమ్మాయి మీద ఎలాంటి శృంగార వాంఛ కూడా కలగలేదు. ఆమె నాకో స్త్రీ అన్న భావమే కలగలేదు. రాత్రంతా ఇద్దరమూ ఒకే పక్క పడుకున్నా ఆమె నాలో ఎలాంటి ఉద్రేకాన్ని కూడా కలిగించదేమోననిపించింది.

''నీకు చాలామంది గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారా దినేష్?''

''నాట్ మెనీ''

''పక్కలో అమ్మాయి ఉండాలనే కోరిక నీకు ఫ్రీక్వెంట్‌గా కల్గుతుందా?''

''అప్పుడప్పుడు''

''నాకు చాలా రాత్రుళ్లు నిద్ర పట్టదు. శరీరమంతా యేదో విపరీతమైన బాధతో

విలవిల్లాడి పోతుంటుంది. అలంటప్పుడు పక్కన నీలాంటి బోయ్ ఫ్రెండుంటే... అతడి శరీరాన్ని కొరుక్కుతింటే నా కసి తీరుతుందనిపిస్తుంది.... బట్... మై మమ్మీ... మా అన్నయ్యకు ఎంతమంది గర్ల్ ఫ్రెండ్స్ ఉన్నా ఫరవాలేదు.... కానీ నేను మాత్రం ఒక్క బోయ్‌తో కూడా చనువుగా ఉండకూడదు. సమ్‌టైమ్స్ ఐ ఫెల్ లైక్ టియరింగ్ హర్ ఐస్... ఆ కళ్లల్లో ఎంత క్రౌర్యం! తనైతే ట్రిమ్ముగా అలంకరించుకుని మా డాడీ పక్కలో పడుకోవచ్చు... అదే తన కూతురికి... ఇరవై యేళ్లు దాటిన కూతురికి... తనలాగే కోరికలుంటాయని వప్పుకోదు. ఈమెగారు ఎవడినో చూసి, శాస్త్రోక్తంగా పెళ్లి చేసి, ఈయనే నీ మొగుడు అని చెప్పేదాకా నేను మడికట్టుకుని, నా సహజమైన కోరికలన్నీ చంపుకొని జీవచ్ఛవంలా బతకాలి! ఆల్ బ్లడీ కన్వెన్షనల్ మొరాలిటీ! ప్రపంచం ఎంత మారినా ఈ దేశం మాత్రం మారదు''

ఆమె ప్రవాహంలా మాట్లాడేస్తోంది. కోపంతో పళ్లు కొరుకుతోంది. పిడికిళ్లు బిగిస్తోంది. బూతు మాటల్ని ఫ్రీగా వదిలేస్తోంది. మై గాడ్! అబ్బాయిలా కనిపిస్తున్న ఈ అమ్మాయిలో అంత కసి, ఇంత ద్వేషం, ఇన్ని కోరికలు ఉన్నాయంటే నమ్మలేక పోయాను.

మా రూం కొచ్చేశాం.

రూం తాళం తీసి, లోపలకెళ్లి లైట్ వేశాను. 'సో దిసీజ్ యువర్ రూం' అంటూ చిందరవందరగా ఉన్న నా బెడ్ మీద పడిపోయిందామె.

''ఐ రియల్లీ లైక్ యువర్ రూం. ఇలా చిందరవందరగా, అడ్డదిడ్డంగా... డర్టీగా... దుమ్ము కొట్టాడుతూ... అక్కడక్కడ సిగరెట్ ముక్కలతో.... సగం చదివి వదిలేసిన సెక్స్ పుస్తకాలతో, ఫిలిం మ్యాగజైన్స్‌తో... న్యూడ్ బొమ్మలతో... బట్ యూ షుడ్ హోల్ మేల్ న్యూడ్స్ ఆల్ సో.... మీకు నగ్నంగా ఉండే ఆడవాళ్ల బొమ్మల్ని చూడాలని ఎంతగా ఉంటుందో మాకు నగ్నంగా ఉండే మొగవాళ్ల బొమ్మలను చూడాలని అంతగా ఉంటుంది. హోయ్.... హోయ్ నాకు నిద్రొచ్చేస్తోంది. అబ్బబ్బ... శరీరాన్ని కుట్టేసినట్టున్న ఈ బట్టలతో ఛస్తున్నాను బాబు... వో లుంగీ ఉంటే ఇవ్వు. ఈ బట్టల్ని తీసేస్తాను అంటూ ఆ అమ్మాయి చకా చకా తాను వేసుకొన్న బట్టలన్నీ విప్పేయసాగింది. బెల్ట్ తీసేసింది... షర్ట్ బటన్స్ తీసేసి షర్ట్ విప్పేసింది. లోపల ఆమె శరీరాన్ని బిగుతుగా అంటిపెట్టుకొని ఉన్న బ్రా హుక్ తీసేసి, బ్రా కూడా విప్పేసింది... నా కళ్లను నేను నమ్మలేకపోయాను. ఇంతసేపు అసలు లేవనుకున్న స్తనాలు ఒక్కసారి రెండు రబ్బరు బంతుల్లా బయటపడ్డాయి... షీ ఈజ్ రియల్ బ్యూటీ... బలంగా, గుండ్రంగా, తెలుగు ప్రబంధ నాయికల క్కూడా ఈర్ష్య పుట్టించేంత పొంకంగా ఉన్నాయి ఆమె స్తనాలు... ఒక్కసారి నా రక్తం ఉప్పొంగింది. చకా చకా నేను కూడా బట్టలు విప్పేయసాగాను. ఆమె బెల్‌బాటమ్స్, అండర్‌వేర్ కూడా విప్పేసి నా రగ్గు కప్పుకొని నా బెడ్‌మీద పడుకొంది.

''కమాన్ దినేష్ బట్టలిప్పేస్తే ఎంత బావున్నావు... నీ ఛాతిమీద దట్టంగా ఉన్న ఆ వెంట్రుకలు నాకు పిచ్చెత్తిస్తున్నాయి... కమాన్ లెటజ్ స్లీప్ టుగెదర్... నీకు వేరే బెడ్

లేదుగా!''

అకస్మాత్తుగా ఆమె మీది కోరికతో వేడెక్కిన నా శరీరం పొగల్ని, సెగల్ని విరజిమ్ముతోంది. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేస్తే నా శరీరం పగిలి, ముక్కలు ముక్కలై పోతుంది.

పక్కమీదకు వెళ్లాను. కానీ నాకంటే ఆమె కోరికల సాంద్రతతో త్రాచుపాములా బుసకొడ్తోంది. నేను ఆమె దగ్గరకు వెళ్లగానే పిచ్చి ఆవేశంతో నా శరీరంమీద పడింది. ఆ క్షణంలో ఆమె నాకో మనిషిలా తోచలేదు.... తక్షణంగా జ్వలిస్తున్న జ్వాల... నా శరీరాన్నంతా కసిగా, క్రూరంగా ముద్దుపెట్టుకుంటుంది.

'లవ్ మేకింగ్' అనే మాటకు తెలుగులో సరైన మాట లేదేమో! ఆమెతో లవ్‌మేకింగ్ నా జన్మలో మరచిపోలేని అనుభవము.

ఆమె ఓ నిప్పురవ్వలా మండిపోతోంది. ఎన్ని యుగాలు గానో పురుష స్పర్శ కోసం తపించి పోతున్న ఆమె శరీరం నా శరీరంతో కసిగా పెనవేసుకుంది. నాతో ఐక్యమై పోయి శాంతించింది. నేను ఆమెలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఆమె చాలా విచిత్రమైన ధ్వనులు చేసింది. అరచింది. నవ్వింది. నన్ను బూతులు తిట్టింది... 'యూ స్కౌండ్రల్... యూ బాస్టర్డ్... హౌ ఎక్సైటింగ్.... హౌ స్వీట్... ఐ వాజ్ ఆల్వేస్ ఇమాజినింగ్ దిస్... కాని నేను ఊహించుకున్న దానికంటే అద్భుతంగా ఉంది... ఐ థాంక్యూ... థాంక్యూ...'

అలసిపోయి ఆమె పక్కన పడిపోయాను. నాకు నిద్ర వచ్చేస్తోంది. యేదో మత్తు నా శరీరాన్ని ఆవహిస్తోంది. ఆమె కూడా నిద్రలోకి జారిపోతోంది. ఎంత అద్భుతమైన, ఎంత మధురమైన, ఎంత ప్రశాంతమైన నిద్రది. ఓ భయంకరమైన తుఫాను తర్వాత యేర్పడే ప్రశాంతతలాంటి నిద్ర. ఎంతసేపు అలా నిద్రపోయామో! ఎన్ని క్షణాలు అలా గడిచిపోయాయో!

మా ఇంటిముందు తలుపుమీద ఎవరో 'ధభీ' 'ధభీ'మని బాదుతోంటే నాకు మెలకువ వచ్చింది. నాకు కరచుకుపోయి నిద్రపోతున్న షీలా! కొన్ని క్షణాల వరకు నేనెక్కడున్నానో నాకు తెలియ లేదు.

తలుపుల మీద మళ్లా 'ధభీధభీ' మని చప్పుడు. మా ఇంటిముందు తలుపుల్ని ఎవరో బాదేస్తున్నారు. ఇంకా తెల్లారలేదు. చీకట్లు విచ్చుకోలేదు. యే నాలుగో, ఐదో అయ్యుంటుంది. మరోసారి తలుపుల్ని బాదిన చప్పుడుతో షీలా ఉలిక్కిపడి లేచింది.

''ఏమిటా చప్పుడు?'' అంది భయపడిపోతూ.

''బయట ఎవరో మా రూం తలుపుల్ని బాదేస్తున్నారు?''

ఆమె దిగ్గున లేచింది. చకా చకా డ్రెస్ చేసుకుంది.

''దినేష్... వాళ్లు నా కోసమే వచ్చారు. తలుపు తీయొద్దు... వాళ్లు నన్ను మళ్లా ఆ నరకంలోకి తీసుకెడ్తారు. మా మమ్మీ నా ప్రాణాలు తీసేస్తుంది. ప్లీజ్ దినేష్... నన్ను రక్షించు దినేష్...''

ఆమె భయంతో వణికిపోసాగింది. నేను లేచి లుంగీ కట్టుకున్నాను.

బయటివాళ్లు తలుపుల్ని అతి భయంకరంగా బాదేస్తున్నారు.

'నువ్విక్కడున్నావని వాళ్లకెలా తెలిసింది'

'నేను పాతాళంలో ఉన్నాసరే, వాళ్లు తెలుసుకుంటారు. తలుపులు తీయొద్దు. తీసినా వాళ్లతో నన్ను పంపించొద్దు... నేను మీతోనే ఉండిపోతాను''

కాని నేను తలుపులు తియ్యకపోతే యే క్షణంలోనైనా ఆ తలుపులు విరిగి పోతాయని నాకు తెలుసు. ఆమె వద్దని అరుస్తున్నా వెళ్లి తలుపులు తెరిచాను.

బయట నిల్చున్న ముగ్గురు వ్యక్తుల్లో జాన్‌ని వెంటనే గుర్తించాను. వీడే వాళ్లకు మా ఇల్లు చూపించాడని అర్థమయింది. ఆ మిగతా ఇద్దరు షీలావాళ్ల నాన్న, అన్నయ్య అని త్వరలోనే గ్రహించాను.

''అరుణా! ఇంట్లోంచి పారిపోయే పాడుపని నువ్వు మరోసారి చేశావన్నమాట! కమాన్... తెల్లవారక ముందే, మన పరువు గంగలో కలియకముందే ఇంటికి వెళ్లిపోదాం పద! మీ మమ్మీ నీ కోసం రాత్రంతా నిద్రపోలేదు...'' అన్నాడు వాళ్ల నాన్న.

''నోనోనో డాడీ! నేను ఇంటికి రాను. అసలది ఇల్లు కాదు. జైలు... మమ్మీ కాదు... జైలర్... సర్కస్‌లో జంతువుల్ని ఆడిస్తాడే రింగ్ మాస్టర్. మమ్మీ నన్నలా ఆడిస్తోంది... నేనా నరకంలోకి రాను. నేను, ఇతడూ పెళ్లి చేసుకున్నాం.... ఇతడితోనే ఉండిపోతాను... నన్ను బలవంతంగా తీసికెళ్లారా... మీ ప్రాణాలు తీసేస్తాను...'' పిచ్చిగా అరిచిందామె.

''నువ్వు మర్యాదగా రాకపోతే నీ కాళ్లు చేతులు కట్టేసి ఈడ్చుకుపోతాం. బి.ఎ చదివావు. ఇరవై యేళ్లొచ్చాయి.... ఇంట్లోంచి పారిపోయి రావటానికి సిగ్గులేదు''

– అన్నాడు వాళ్లన్నయ్య. వాళ్లన్నయ్య, వాళ్ల నాన్నల్ని చూస్తే వాళ్లు లక్షాధికారు లనిపించారు.

''సిగ్గు... సిగ్గు నీకుందా? మగవాడివి కాబట్టి నీకు సిగ్గు లేకపోయినా ఫరవాలేదు. నువ్వేం చేసినా చెల్లుతుంది. నిన్ను హీరోలా చూస్తారు... అదే నన్ను...జైల్లో పెట్టి బంధిస్తారు... అన్నయ్యా! నన్ను బలవంతంగా తీసికెళ్లే ప్రయత్నం చేశావా నేనేం చేస్తానో నాకు తెలియదు...'' అంటూ పక్కనే ఉన్న రెండు గాజు గ్లాసుల్ని చేతిలోకి తీసుకుందామె. మరుక్షణంలో ఆ గదంతా ఓ రణరంగంగా మారింది.

వాళ్లన్నయ్య ఆమె మీదకు వెళ్లబోయాడు. ఆమె తన చేతిలో ఉన్న గ్లాసుల్ని అతని మీదకు విసిరింది. చేతికేది దొరికితే దాన్ని ఆమె తన ఆయుధంగా ఉపయో గించింది. గదంతా పిచ్చిగా పరిగెత్తింది. వాళ్లు ముగ్గురు ఆమెను బంధించడానికి ప్రయత్నించారు. ఆమె నా వెనక్కి వచ్చి నన్ను గట్టిగా పట్టుకుంది....

''దినేష్... నన్ను రాక్షసులనుండి రక్షించవూ... ప్లీజ్.... ప్లీజ్'' అని బతిమాలింది.

వాళ్లన్నయ్య నాకేసి కోరగా చూస్తూ 'అడ్డమొచ్చావంటే నీ రక్తం కళ్లజూస్తా' నన్నాడు. ఆమె మరోసారి తన శక్తినంతా కూడదీసుకుని పోట్లాడింది. పుస్తకాలు, గ్లాసులు, వంటపాత్రలు, విస్కీ బాటిల్స్, స్టౌ, కిరోసిన్ టిన్ అన్నీ వాళ్లమీదకు విసిరేసింది. అయినా వాళ్లు ముగ్గురూ కలిసి ఆమెను గట్టిగా పట్టుకున్నారు. జంతువును ఈడ్చుకు వెళ్లినట్లుగా ఆమెను బయటకు తీసికెళ్లి, బయటున్న వాళ్ల కార్లో పడేశారు. ఆమె అరిచింది. వాళ్లను రక్కింది, తిట్టింది, ఈ రాక్షసుల్ని తప్పించుకొని మరోసారి నీ దగ్గర కొస్తాను దినేష్' అంది. కారు కదిలిపోయింది.

తలుపులు మూసేసి నా పక్కమీదకు వెళ్లబోయిన నా కాలికి గాజుముక్క గుచ్చుకొని రక్తం కారింది. గదిలో ఎక్కడ చూసినా గాజు ముక్కలే... నానా భీభత్సంగా తయారైంది నా గది. పూర్ షీలా! ఈ దేశంలో స్త్రీల తిరుగుబాటు ఎంత క్షణికమో, ఎంత బలహీనమైందో తెలిసిపోయింది. ఈ పరిస్థితి యేనాటికైనా మారుతుందా? ★

'కేకలు' దీపావళి సంచిక

21.11.75